


26న సీఎం కుప్పం పర్యటన..?

'జగనన్న చేయూత' మరోసారి వాయిదా

ప్రజాశక్తి - రామకుప్పం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 26 వ తేదీన కుప్పం నియోజకవర్గ పర్యటనకు విచ్చేయనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే రెండు సార్లు సీఎం కుప్పం పర్యటన వాయిదా పడింది. ఈ నెల 9 వ తేదీన ఒకసారి, 16 వ తేదీన మరోసారి ముఖ్యమంత్రి పర్యటన ఉంటుందని పేర్కొన్నారు. ఏర్పాట్లలో తలమునకలయ్యారు. అయితే అనివార్య కారణాల వల్ల ఈ రెండు సార్లు పర్యటన వాయిదా పడినట్లు తెలుస్తోంది. కాగా ఈ నెల 26 న సీఎం కుప్పం పర్యటన ఉంటుందని , అందుకు అవసరమైన సభ ఏర్పాట్లు సైతం ప్రారంభమయ్యాయి. అయితే ముఖ్యమంత్రి కుప్పం నియోజకవర్గ పర్యటన పై పూర్తి స్థాయిలో అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

తిరుపతిలో కార్మిక, కర్షక సంఘాల భారీ ర్యాలీ



ఇంటి పట్టాలివ్వాలని బంద్‌లో పాల్గొన్న పేదలు



కార్మిక, కర్షక పేదల ఐక్యత 'బంద్' సక్సెస్..!

మోడీ, జగన్ గద్దె దిగాల్సిందే..! / 'చీకటి' చట్టాలకు చరమగీతం పాడుదాం / వందలాది మందితో భారీ ప్రదర్శనలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

తిరుపతిలో పూర్ణకుంభం సర్కిల్ వద్ద భారీ ప్రదర్శన, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం జరిగిన సభకు సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నగర కార్యదర్శులు కె.వేణుగోపాల్, ఎన్‌డి రవి, విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ దేశంలో నరేంద్రమోడీ కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల పట్ల అన్యాయంగా ప్రవర్తిస్తున్నారని, గ్రామీణ భారతం నిర్వీర్యం అయ్యిందన్నారు. అప్పుల కుంపటిగా మారిన భారతదేశంలో అదానీ, అంబానీలు రాజ్యమేలుతున్నారని మండిపడ్డారు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయని ధ్వజమెత్తారు. ప్రజల కొనుగోలు శక్తి పెరగలేదని, ఉపాధి లేక నిరుద్యోగులు వీదుల పాలయ్యారన్నారు. మోడీ రామమందిరం పేరిట ప్రజా సమస్యలను పక్కదారి పట్టించి మతోన్మాద చర్యలకు పాల్పడుతూ ప్రజల దృష్టి మళ్లిస్తున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు రాష్ట్రానికి బిజెపి చేసిన ద్రోహాన్ని పట్టించుకోకుండా బిజెపితో అంటకాగడం అన్యాయమని విమర్శించారు. కరకంబాడిలో పేదలకు ఇళ్లస్థలాల సాధన కోసం చేస్తున్న పోరాటాన్ని కార్మిక సంఘాలు బలపరుస్తున్నాయన్నారు. ట్రాన్స్‌పోర్టు రంగంలో న్యాయసంహిత పేరిట కేంద్ర ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలు ఈ రంగానికి ఉరితాళ్లుగా మారాయన్నారు.

వామపక్ష, ప్రజాసంఘాల మద్దతు

సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, పి.మురళిలు కార్మిక సంఘాలు చేపట్టిన బంద్‌కు సంఘీభావం ప్రకటించారు. ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.హేమలత, రాష్ట్ర కార్యదర్శి ఎ.రామానాయుడు మాట్లాడుతూ ఢిల్లీ నగర వీధుల్లో రైతులు చేపట్టిన ఉద్యమం మోడీని గద్దె దింపేందుకు కారణమవుతుందన్నారు. భారతదేశంలో వ్యవసాయ కార్పొరేటీకరణ పెరిగిపోయి, రైతుల ఆత్మహత్యలకు కారణమవుతోందన్నారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు నేతలు టి సుబ్రమణ్యం, ఎన్ మాధవ్, యన్. చిన్నా , బుజ్జి, రఘు ఎన్ డి శ్రీనివాసులు, కుమార్, సులోచన లీల, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జయంతి, అంగన్వాడి కార్యదర్శి నాగరాజమ్మ, జయప్రభ, సుశీలమ్మ,హమాలి రమేష్, తంజావూరు మురళి, వాసు, సుందరం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి,ఏఐటియుసి నేతలు విశ్వనాధ్, పెంచలయ్య, శ్రీనివాసులు, శ్రీరాములు ఐఎఫ్టియు నేతలు గంగాభవాని, వెంకటేశ్వ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్‌లో టవర్‌క్లాక్ సెంటర్ నుంచి ప్రదర్శనగా బయల్దేరి ఆర్డీవో కార్యాలయం చేరుకుని ఎఒకు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులు అమలు చేస్తేనే అన్నదాతకు ధర గిట్టుబాటవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, నాయకులు జోగి శివకుమార్, బివి రమణయ్య, ఎస్.సురేష్, అడపాల ప్రసాద్, పామంజి మణి, సిపిఐ నాయకులు జి.శశికుమార్, ఎంబేటి చంద్రయ్య, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్‌లో... సిపిఎం, సిపిఐ జిల్లా నాయకులు ఆర్.వెంకటేష్, మహేష్ నేతృత్వంలో అంబేద్కర్ సర్కిల్ నుంచి పెట్రోల్ బంక్ వరకూ భారీ ప్రదర్శన నిర్వహించారు. ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచాలని నినాదాలు చేశారు.గోపి, కృష్ణారెడ్డి, రమేష్, హరి, భాస్కర్, విజయ్, పురుషోత్తం, రమేష్, శివ, వెంకటేష్ పాల్గొన్నారు. **నారాయణవనంలో...** సిపిఎం మండల కార్యదర్శి మునిశంకర్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం డ్రైవర్ల మెడకు ఉరితాడు బిగించేలా సెక్షన్లు 106 (1), (2) హిట్ అండ్ రన్ చట్టాలను తెచ్చారన్నారు. దీనివల్ల పదేళ్లు జైలు, ఏడు లక్షల జరిమాన విధించేలా నిబంధనలు ఉన్నాయన్నారు. నాగభూషణం, ఈశ్వరయ్య, సుమతి, సుబ్రమణ్యం, రాఘవయ్య, వెంకటేష్ పాల్గొన్నారు. **పాకాలలో** సిఐటియు సీనియర్ నాయకులు మధుసూదనరావు ఆధ్వర్యంలో నిరసన జరిగింది. నరేంద్ర, సుశీలమ్మ, రాజా, కుమారి, సురేష్, రవి, హరి పాల్గొన్నారు.

కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వాలు ప్రజలను జలగల్లా పీల్చి పిప్పి చేస్తున్నాయని, రానున్న ఎన్నికల్లో వీరిని ఇంటికి సాగనంపాలని సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శులు కందారపు మురళి, రాధాక్రిష్ణ, కె.సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. గ్రామీణ భారత్ బంద్ జిల్లా వ్యాప్తంగా జయప్రదమయ్యింది. శుక్రవారం జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుండి పూర్ణకుంభం సర్కిల్ వరకు భారీ ప్రదర్శన జరిగింది. చీకటి చట్టాలకు చరమగీతం పాడాలని, గిట్టుబాటు ధర కల్పించాలని, కనీస వేతనం ఇవ్వాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు రెండు గంటలపాటు భారీ రాస్తారోకో జరగడంతో కిలోమీటర్ల కొద్దీ వాహనాలు నిలిచిపోయాయి. ఎర్ర జెండాల రెప రెపలతో పూర్ణకుంభం సర్కిల్ ఎరుపుమయమయ్యింది.

శ్రీకాళహస్తిలో...సిఐటియు మండల కార్యదర్శి పెనగడం గురవయ్య, రైతుసంఘం జిల్లా నాయకులు రామిశెట్టి వెంకయ్య ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. గంధం మణి, వెంకటేష్, వేణు, రాజా, మించల శివకుమార్ పాల్గొన్నారు. **కెవిబిపురంలో..** తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఢిల్లీ నడివీధుల్లో పోరాటం చేయడంతో వ్యవసాయ నల్లచట్టాలను రద్దు చేస్తున్నట్లు మోడీ ప్రకటించి దొడ్డిదారిన అమలు చేశారన్నారు. నాగలాపురం నాగరాజు, గంగయ్య, వెంకటేష్ పాల్గొన్నారు. **వరదయ్యపాలెంలో..** బస్టాండ్ వద్ద ప్రదర్శన నిర్వహించారు. నాయకులు శాంతి, ధనంజయులు, చిన్నిరాజ్, సిద్దలయ్య, తరుణ్‌కుమార్, చంద్ర, మురళి, బాల గురునాథం పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో...అంబేద్కర్ విగ్రహం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. **సత్యవేడులో...** సిఐటియు నాయకులు ఎం.రమేష్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నిర్మల, భారతి, విజయ, శాంతి, వనమ్మ, భారతి, మునస్వామి పాల్గొన్నారు. **వెంకటగిరిలో**..ప్రదర్శన నిర్వహించారు. ఎంఆర్ఒ కూడలి వద్ద రైతుకూలి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివి రమణయ్య మాట్లాడుతూ రైతులు పండించే అన్ని రకాల పంటలకు పెట్టుబడికి 50శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలని స్వామినాథన్ సిఫార్సు చేశారని గుర్తు చేశారు. వ్యకాసం జిల్లా కార్యదర్శి పి.బాలకృష్ణయ్య, సిఐటియు నాయకులు వడ్డిపల్లిచెంగయ్య, సిహెచ్ చిన ఓబయ్య, జి.తిరుపాలు పాల్గొన్నారు. **నాయుడుపేటలో..** సిఐటియు జిల్లా కార్యదర్శి శివకవి ముకుంద ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. శ్యామలమ్మ, నాగమణి, సుజాత, చంద్రకళ, కె.విజయమ్మ, వాణి పాల్గొన్నారు.

గూడూరులో..




నాయుడుపేటలో..



పేదల గుడిసెలకు పట్టాలివ్వాలి

కరకంబాడి ఇంటిస్థలాల పోరాట కమిటి భారీ ప్రదర్శన

తిరుపతి టౌన్ : రేణిగుంట కరకంబాడి సర్వే నంబర్ 153/1లో ఎర్రగుట్టపైన గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా నాయకులు అంగేరి పుల్లయ్య, హరినాథ్ డిమాండ్ చేశారు. తిరుపతిలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన గ్రామీణ భారత్ బంద్‌కు రేణిగుంట కరకంబాడి ఇళ్లస్థలాల సాధన పోరాట కమిటి వందలాది మంది పేదలతో కపిలతీర్థం నుంచి బస్టాండ్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ కరకంబాడి ఎర్రగుట్టపైన జగనన్న పట్టాదారులు, పేదలు కలిసి జనవరి 26న జాతీయ జెండా ఎగురవేసి దాదాపు ఐదువేల మంది గుడిసెలు వేసుకున్నారని, వారిపట్ల పోలీసు, రెవెన్యూ అధికారులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారన్నారు. నిరుపేదల గుడిసెలకు ఇంటి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. గుట్టలో మట్టిని, రంగురాళ్లను తవ్వి వందల కోట్లు అక్రమంగా సంపాదిస్తున్న కబ్జాదారు సిద్దుల రవిపై మైనింగ్ అక్రమ రవాణా కేసు పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివానందం, వెంకటరమణ, సెల్వరాజ్, పి.రాజశేఖర్, సత్యశ్రీ పాల్గొన్నారు.



తిరుపతి కలెక్టరేట్ ఎదుట ఉద్యోగుల నిరసన

కలెక్టరేట్లో ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

రాష్ట్ర జేఏసీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఏపీ జెఎసి చైర్మన్, తిరుపతి అధ్యక్షులు ఎస్ సురేష్ బాబు ఆధ్వర్యంలో తిరుపతి కలెక్టరేట్‌లో శుక్రవారం ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఎస్ సురేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులపై తీవ్ర నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుందని, ఉద్యోగులు దాచుకున్న జిపిఎఫ్ ,ఏపీ జి ఎల్ ఐ బిల్లులు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని పేర్కొన్నారు. ఐదేళ్లలో ఒకే ఒక డిఏ ఇచ్చిన ఏకైక ప్రభుత్వం ఇదేనని, ఇలాంటి ప్రభుత్వాన్ని ఇక ముందు చూడలేమని పేర్కొన్నారు, సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తానని హామీ ఇచ్చి, గాలికి వదిలేసిందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ పై జీవో విడుదల చేసి అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని, తక్షణమే వాళ్ళని రెగ్యులర్ చేయాలని కోరారు. జేఏసీ సెక్రటరీ జనరల్ నిర్మల మాట్లాడుతూ ఉద్యోగులకు ఈ ప్రభుత్వం సుమారు 22 వేల కోట్ల రూపాయలు బకాయి ఉందన్నారు. 12వ పిఆర్సి అమలులో ఆలస్యమైనందువలన పెరిగిన ధరలను అనుసరించి 30 శాతం మధ్యంతర భతిని ప్రకటించాలని కోరారు, ఈ కార్యక్రమంలో గిరి బాబు, శ్రీనివాసులు, హిమగిరి, పద్మజ, రవి శంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, జగన్నాథం, వెంకట ముని, రమణారెడ్డి, ముని కేశవులు, మునిరత్నం, తదితరులు పాల్గొన్నారు

బుచ్చినాయుడు కండ్రిగ : మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ఎపిజెఎసి పిలుపు మేరకు దశలవారీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు. పెండింగ్ డిఎలు విడుదల చేయాలని, బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



శ్రీకాళహస్తిలో..



వెంకటగిరిలో..



పుత్తూరులో..



కెవిబిపురంలో

నిరవధిక సమ్మెలోకి వ్యవసాయ కళాశాల కాంట్రాక్టు కార్మికులు



ప్రజాశక్తి - క్యాంపస్ (ఎస్వీయూ)

తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి శుక్రవారం నుంచి తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ కళాశాల కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. దీక్షా శిబిరం వద్ద సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, జయచంద్ర మాట్లాడుతూ గత 22 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం అమలు చేయడం లేదని, సుప్రీం తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, టైంస్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గండికోట చిన్నబాబు, టైంస్కేల్ ఉద్యోగ సంఘం నాయకులు మురళి, యూనియన్ అధ్యక్షురాలు వరలక్ష్మి, కార్యదర్శి రాకేష్, నాయకులు సుబ్బు, రేవతి, చంద్రమ్మ, అనురాధ, మునిలక్ష్మి, రమ, మురళి పాల్గొన్నారు.

మరుగున మెగా ఖ'నిజం'

- రాళ్ల సంగతి తేల్చని అధికారులు
- పట్టుకున్న లారీలనూ వదిలేసిన వైనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి/తొట్టంబేడు



పట్టుబడిన లారీ (ఫైల్)

తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం కాసరం చెరువులో 'మెగా' తవ్వకాల్లో బయటపడ్డ విలువైన రాళ్ల సంగతిని తేల్చడంలో సంబంధిత అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. మెగా తవ్వకాల్లో విలువైన ఖనిజపు రాయి బయటపడి నాలుగు రోజులు గడుస్తున్నా ఆ నిజాన్ని అధికారులు ఎందుకు దాస్తున్నారనే అనుమానం వ్యక్తమవుతోంది. కాసరం చెరువులో బయటపడ్డ ఆ రాయి ఏ కోవకు చెందిందో తెలుసుకునేందుకు సంబంధిత అధికారులు కనీస ప్రయత్నం చేయకపోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అది విలువైన రాయి కాబట్టే, దాన్ని మెగా యాజమాన్యం చౌర్యం చేసిందనీ, కొందరు అధికారి పార్టీ నేతల ఒత్తిళ్ల కారణంగా అధికారులు 'ఖ'నిజాన్ని దాస్తున్నారంటూ ప్రజలు మండిపడుతున్నారు.

లారీలనూ వదిలేశారు!

నాయుడుపేట నుంచి మదనపల్లి వరకు ఆరు లైన్ల రోడ్డును ఏర్పాటు చేస్తున్న విషయం అందరికీ విదితమే. మొదటి దశలో భాగంగా ఈ పనులను ప్రముఖ సంస్థ మెగా కంపెనీ రూ.5 వేల కోట్ల వ్యయంతో చేపడుతోంది. ఇప్పటికే 50 శాతం పైగా పనులు పూర్తయ్యాయి అయితే పనులను చేసే సమయంలో వీరికి అవసరమైన మట్టిని చెరువుల నుంచి ఇష్టారాజ్యంగా తరలించడంతో చెరువులు లోయలుగా మారిపోతున్నాయి. పరిమితికి మించి లోతుకు తొట్టంబేడు మండలంలోని కాసరం చెరువులో గత రెండు నెలల నుంచి భారీ టిప్పర్లతో మట్టిని తరలించడంతో ఈనెల 13వ తేదీ మంగళవారం కొన్ని విలువైన రాళ్లు బయటపడ్డాయి. వాటిని గుట్టు చప్పుడు కాకుండా మెగా యాజమాన్యం ఊరు దాటించినట్లు సమాచారం. సుమారు మూడు టిప్పర్ల రాళ్ళను అక్రమంగా తరలించినట్లు సమాచారం. వీటి విలువ చాలానే ఉంటుందన్నది గ్రామస్తుల అనుమానం. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు తొట్టంబేడు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో స్పందించిన ఎస్పై రాఘవేంద్ర మట్టి తరలిస్తున్న ఒక టిప్పర్ను స్వాధీనం చేసుకుని అందులో ఉన్న రాళ్లను పరిశీలించారు. అయితే అది ఏ రకం రాయో తెలియక పోలీసులు రెవెన్యూ అధికారులకు అప్పజెప్పారు. అయితే తవ్వకాల్లో బయటపడ్డ ఆ రాయి ఏ కోవకు చెందిందో అధికారులు ఇప్పటి వరకు తేల్చలేదు. ఆ రాయిని మైనింగ్ శాఖ అధికారులకు కూడా పంపనట్లు తెలుస్తోంది. విలువైన రాయిని మెగా యాజమాన్యం దొంగలించిందని కాసరం గ్రామస్తుల నుంచి రాతపూర్వకంగా ఎలాంటి ఫిర్యాదూ అందలేదనీ, కేవలం ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే విచారించి వదిలిపెట్టామని తొట్టంబేడు పోలీసులు తెలపడం గమనార్హం. ఏదిఏమైనా రెవెన్యూ, మైనింగ్ అధికారులు 'మెగా'కు కొమ్ముకాస్తూ 'మైనింగ్'ను తరలించేస్తున్నారన్న వాస్తవాన్ని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఆరోపణలపై కనీసం ఆయా శాఖలు స్పందించకపోవడం గమనార్హం.


విశేషంగా రథసప్తమి

సంతృప్తికరంగా వాహనసేవల దర్శనం

ప్రజాశక్తి - తిరుమల

సూర్యజయంతి సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన రథసప్తమి ఉత్సవానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీలన్నీ పూర్తిగా నిండిపోయాయి. ఉదయం 5.30 నుండి రాత్రి 9 గంటల వరకు భక్తులు సప్తవాహనాలపై శేషాచలాధీశుని వైభవాన్ని తిలకించి తరించారు. టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి, జెఇఒ వీరబ్రహ్మం వాహనసేవల్లో పాల్గొని, భక్తులకు అందుతున్న సేవలను పర్యవేక్షించారు.

చలికి, ఎండకు ఇబ్బందుల్లేకుండా నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీల్లో ఏర్పాటుచేసిన తాత్కాలిక షెడ్లలో భక్తులు సౌకర్యవంతంగా కూర్చుని వాహనసేవలను తిలకించారు. శ్రీవారి సేవకులు భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు పంపిణీ చేశారు. ముఖ్య కూడళ్లలో శోభాయమానంగా పుష్పాలంకరణ, విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. 850 మంది టిటిడి నిఘా, భద్రతా సిబ్బంది, 700 మంది పోలీసుల సేవలను వినియోగించుకున్నారు. 2900 మంది శ్రీవారి సేవకులు భక్తులకు సేవలందించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు వీక్షించేందుకు వీలుగా ఎస్వీబీసీలో వాహనసేవలను ప్రత్యక్షప్రసారం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి 900 మంది కళాకారులు పాల్గొన్నారు.



రుయాలో భద్రత డొల్ల..!

సిసి కెమెరాల ఊసే లేదు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

రాయలసీమకు తలమానికం రుయా ఆస్పత్రి.. అయితే భద్రత డొల్లతనం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. పేదల పెద్దాసుపత్రిలో సిసి కెమెరాల ఊసే లేదు. నిత్యం ఏదో ఓ చోట చోరీలు జరుగుతూనే ఉన్నా పట్టించుకునే నాధుడే లేడు. రోగులు నిలదీస్తే సెక్యూరిటీ సిబ్బందిపైకి నెట్టేయడం షరా మామూలయ్యింది. సుమారు 20 వేల మంది నిత్యం ఇక్కడ వైద్యసేవలు పొందడం, విధులు నిర్వహించడం, శిక్షణ పొందడం చేస్తుంటారు.అయితే పరిపాలనా, పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉండటం గమనార్హం.

శ్రీవేంకటేశ్వర రామ నారాయణ రుయా గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (ఎస్‌విఆర్‌ఆర్‌జిజిహెచ్). రుయా ఆసుపత్రిగా అందరికి సుపరిచితమే. రాయలసీమ ప్రాంతంలోనే ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అతిపెద్ద పేదల పెద్దాసుపత్రి ఇది. రాయలసీమలోని ఉమ్మడి చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలతో పాటు కోస్తాంధ్రకు చెందిన ఉమ్మడి నెల్లూరు జిల్లా, తమిళనాడు, కర్ణాకట రాష్ట్రాల్లోని సరిహద్దు ప్రాంతాలకు చెందిన లక్షలాది మంది ప్రజలకు ఇదే ప్రదాన ఆసుపత్రి. ఇక్కడ నిత్యం ఓపి సేవల నిమిత్తం 1200 నుంచి 1500 మంది వరకు వస్తుంటారు. సోమ, మంగళవారాల్లో ఓపి సంఖ్య 2000కు పైగా ఉంటుంది. 1000 పడకల సామర్థ్యం గల ఈ ఆసుపత్రిలో నిత్యం 1500కు పైగా రోగులు చికిత్స పొందుతుంటారు. పడకలు చాలక స్ట్రెచ్చర్లపై, వీలు చైర్లపై రోగులు చికిత్స పొందడం ఇక్కడ నిత్యకృత్యం. అత్యంత ప్రాచీనమైన ఎస్‌వి మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఈ ఆసుపత్రి సేవలందిస్తుంది. ఎస్‌విఎంసి నుంచి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, దేశ విదేశాల్లో స్థిరపడిన అనేక మంది ప్రముఖ వైద్యులు ఈ కళాశాల నుంచి వైద్య పట్టా పొందిన ఘన చరిత్ర కలది. రుయా ఆసుపత్రికి అదనంగా ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల (గవర్నమెంట్ మెటర్నటీ హాస్పిటల్), చిన్నపిల్లల ఆసుపత్రి (చిల్డ్రన్స్ హాస్పిటల్) వైద్యసేవలు అందిస్తున్నాయి. రుయా అత్యవసర విభాగానికి రోజుకు 500మందికి పైగా రోగులు అత్యవసర చికిత్స నిమిత్తం వస్తుంటారు. వందలాది మంది ఎంబిబిఎస్, పిజి విద్యార్థులు,



శ్రీపద్మావతి ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు చెందిన నర్సింగ్ విద్యార్థులు, పారామెడికల్ విద్యార్థులు, పలు విభాగాలకు చెందిన వైద్య అధ్యాపకులు, వైద్యనిపుణులు, వైద్యులు, వైద్య విద్యార్థులు, వైద్య సిబ్బంది, సెక్యూరిటీ, పారిశుద్ధ కార్మికులు, వీరికి తోడు వివిధ ప్రయివేట్ నర్సింగ్ కళాశాల నుంచి సుమారు వెయ్యికి పైగా నర్సింగ్ విద్యార్థులు ఇక్కడ సేవలందిస్తుంటారు. జిగ్‌జాగ్‌గా ఉండే రుయాలో ఎప్పుడు ఎక్కడ ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి. ఇంతటి ప్రాముఖ్యత కల్గిన ఈ ఆసుపత్రిలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. నిత్యం ఏదో ఓ చోట చోరీలు జరుగుతూనే ఉంటాయి. రోగులు, రోగుల సహాయకులు నిత్యం బాధితులే. కొన్ని బయటకొస్తాయి. అనేకం బయటకు పొక్కక పోవడం గమనార్హం. పైగా బయటకు వచ్చిన వాటిలో కూడా పోలీసుల దృష్టికి వెళ్లేవి వేళ్లపై లెక్కపెట్ట వచ్చు. పలు చోరీలకు పాల్పడే పాతనేరస్తులు సైతం రుయా ప్రాంగణాన్ని తమ అడ్డాగా మార్చుకుంటున్నారు. కోట్లాది రూపాయాలు అభివృద్ధి పేరుతో వెచ్చిస్తున్న జిల్లా అధికారులు కనీసం సిసి కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం కొస మెరుపు. ఇటీవల పోలీసులు వెంటపడి వేడుకుంటే అరాకొరాగా సిసికెమెరాలు ఏర్పాటు చేశారు. అవి కూడా సక్రమంగా పనిచేస్తున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి 'భద్రత'ను పటిష్టం చేయాల్సి ఉంది.

ఎంపిపి పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కనవణంబేడు పంచాయతీలోని ఎంపిపి పాఠశాలను ఎంఇవో ముని సుబ్రహ్మణ్యం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలు భాగంగా విద్యార్థులతో కలిసి వారి వసతులు, పౌష్టిక ఆహారం గురించి, మధ్యాహ్న భోజనం గురించి ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యాశాఖ అధికారి పిల్లలతో కూర్చొని మధ్యాహ్న భోజనాన్ని తిని ఇంకా రుచికరంగా చేయాలని వంట వారిని ప్రోత్సహించి వారికి సకాలంలో కావాల్సినవి ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని సంగం థియేటర్ కూడలి వద్ద హీరాబెన్ మాతాజీ గ్లోబల్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ దేవరాయల జయంతి సందర్భంగా రాష్ట్ర కాపు నాడు కార్యదర్శి కంకణాల పెంచల నాయుడు ఆధ్వర్యంలో పేదలకు శుక్రవారం దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భాష లందు తెలుగు లెస్స అని తెలుగు భాషను కొనియాడిన మహనీయుడు అని పేర్కొన్నారు. ఆయన తెలుగు భాషకు చేసిన కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): మండలంలో శ్రీనివాస మంగాపురం సమీపంలో ఉన్న వెంకట పద్మావతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(విమ్స్)లో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు బెంగళూరుకు ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ప్రజిత్ పాశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత గుండె వైద్య శిబిరం బెంగళూరుకు చెందిన బెలెనస్ ఛాంపియన్ హాస్పిటల్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఉచిత గుండె వైద్య శిబిరంలో గుండెకు సంబంధించిన వ్యాధులతో పాటు బీపీ, షుగర్, 2డి–ఎకో, కొలెస్ట్రాల్, వ్యాధులకు వైద్య పరీక్షలు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించనున్నట్లు విమ్స్ ప్రతినిధులు తెలిపారు. పూర్తి వివరాలకు 9059738537, 9053747049 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని విమ్స్ అధికారులు తెలిపారు.

'రాజధాని ఫైల్స్' చిత్రంతో భయపడ్డ జగన్: కురుగొండ్ల

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్: రాజధాని ఫైల్స్ సినిమా విషయంలో ప్రభుత్వ కుట్రలు కోర్టు తీర్పుతో బద్దలయ్యాయని, రాజధాని విషయంలో జగన్ చేసిన విష ప్రచారం, అమరావతి విధ్వంసంపై సినిమాలో కళ్లకు కట్టినట్లు చూపించారని దీంతోజగన్‌కు భయం పట్టుకుందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక పాలకుడి కుట్రలతో ప్రజా రాజధాని ఎలా విధ్వంసం అయ్యిందో చూపించారన్నారు. ప్రభుత్వం టెర్రరిజంతో చేసిన విధ్వంసం ఈ సినిమా ద్వారా అందరికీ చేరుతుందని జగన్‌కు వణుకు మొదలైందన్నారు. సొంత పార్టీ నేతల ద్వారా కేసులు వేసి సినిమాను అడ్డుకునేందుకు యత్నించాడన్నారు. ఈ సమావేశంలో తిరుపతి పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి పులుకొల్లు రాజేశ్వరావు, అవ్వారు సత్యనారాయణ, రూరల్ మండల అధ్యక్షులు పప్పు చంద్రమౌళి రెడ్డి, పార్లమెంట్ కార్యదర్శి మగ్గం వెంకటాచలం, రాష్ట్ర బిసి సాధికార సమితి సభ్యులు తాండవ చంద్రా రెడ్డి పాల్గొన్నారు.

ఎస్వీ క్రీడా మైదానంలో కట్టడాలు నిలిపివేయాలి

చర్చలో మేధావుల తీర్మానం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఎస్‌వి హై స్కూల్ క్రీడా మైదానంలో చేపడుతున్న నిర్మాణాలను వెంటనే ఆపివేయాలని పలువురు మేధావులు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రకాశం రోడ్డులోని ఎస్వీ హైస్కూల్ క్రీడా మైదానం పక్కనున్న అంబేద్కర్ భవన్‌లో ఎస్వీ హై స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో తిరుపతిలోని మేధావుల, ప్రజాసంఘాలతో 'క్రీడామైదానం లో కట్టడాల నిలిపివేయాలి'పై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడా మైదానాలు చాలా ముఖ్యమని పిల్లలకు చదువులే కాకుండా ఆటలలో ప్రావీణ్యానికి దోహద పడుతాయన్నారు. త్వరలో క్రీడా మైదానంలో కట్టడాల నిలిపివేతపై ర్యాలీ ని నిర్వహించాలని టిటిడి ఈవో కు లేఖను సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఖాసీం, గుండ్లూర్ వెంకటరమణ, దేవరాజులు, చిరంజీవి, మునికృష్ణమ నాయుడు, సోమయ్య, ముబారక్ , బెల్లంకొండ సురేష్ , డాక్టరు హరిత, నామా రాజేష్ , బాలాజీ , శ్రీనివాసులు , బింబినో చంద్ర , రామారావు , యోగ వెంకటేష్ , సుధాకర్ పాల్గొన్నారు.

'తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా'

ప్రజాశక్తి -గూడూరు రూరల్: తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా సౌకర్యాన్ని తపాలా శాఖ అందిస్తోందని ఆ శాఖ సూపరింటెండెంట్ ఎస్ఎస్ వీఏకే కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ప్రధాన పోస్టల్ కార్యాలయంలో తపాలా శాఖలో జీఏజీ ప్రమాద పాలసీ చేసుకొని ప్రమాదవశాత్తు మరణించిన వ్యక్తి కుటుంబానికి ప్రమాద బీమా పరిహారం రూ.10 లక్షల చెక్కును ఆయన బాధితురాలికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక ప్రీమియం రూ. 555 తో పది లక్షల ప్రమాద బీమా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ బీమా తో ప్రమాదం వల్ల మృతి చెందినా, అంగవైకల్యం సంభవించినా రూ. 10 లక్షలు, హాస్పిటల్ ఖర్చులు లక్ష, ఒకసారి హెల్త్ చెకప్, టెలి కన్సల్టేషన్ వంటి సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. రోడ్ యాక్సిడెంట్, పిడుగుపాటు, కరెంటు షాక్, పాముకాటు వంటి ప్రమాదాలకు బీమా పొందవచ్చన్నారు. ఈ పాలసీలు ప్రతి పోస్ట్ ఆఫీస్ లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ సిబ్బంది, ఏఎస్పీ బి మణికంఠన్, ఐపీపీబీ సీనియర్ మేనేజర్ శరత్ కుమార్, మేనేజర్ వేణు, అసిస్టెంట్ మేనేజర్ గురుభావన్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల రుణాలు మాఫీ : మాజీ కేంద్రమంత్రి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశంలోని ఎస్సీ, ఎస్టీల రుణాలను మాఫీ చేస్తామని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ అన్నారు. శుక్రవారం ఆయన ఏపీ రాజధాని అంశంపై మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర రాజధానిగా తొలుత తిరుపతిగా అనుకున్నారని, అది కాస్త కర్నూలుగా మారిందని, ఆ తర్వాత హైదరాబాద్‌కు తరలిందని, అక్కడినుంచి తుళ్లూరు వచ్చిందని నేడు విశాఖ అంటున్నారన్నారు. తిరుపతిని రాష్ట్రానికి ప్రధాన నగరంగా చేస్తారని కాలజ్ఞాని బ్రహ్మంగారు 300 ఏళ్ల కిందటే చెప్పారని గుర్తు చేశారు. నీరు మీకు– రాళ్లు మాకా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కి అధికారం ఇస్తే ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకుల్లో ఉన్న అన్ని వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు.

వైసిపి అవినీతిని ఎండగట్టాలి: టిడిపి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వైసిపి ప్రభుత్వ అవినీతి, అరాచక పాలనను ఎండగట్టాలని టిడిపి పుత్తూరు నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ అన్నారు. పుత్తూరు రూరల్ మండలం వేపగుంట, పరమేశ్వరమంగళంలో స్థానిక టిడిపి, జనసేన నేతలతో కలిసి 'బాబు ష్యూరిటీ– భవిష్యత్తు గ్యారెంటీ'ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు అవినీతిని ఎండగట్టాలని కోరారు. నాలుగేళ్ల కాలంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. యువత నిరుద్యోగులై రాష్ట్రాన్ని విడిచి వెళ్లిపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు రూరల్ మండలం వేపగుంట, పరమేశ్వరమంగళం స్థానిక టిడిపి , జనసేన నాయకులు పాల్గొన్నారు.

10 వేల ఎకరాలకు సాగునీరు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక స్వర్ణముఖి నదిపై చెక్ డ్యామ్ నిర్మాణానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. రూ.53.62 కోట్ల వ్యయంతో చెక్ డ్యామ్ పనులు పూర్తి కానున్నాయి. చెక్ డ్యామ్ పనులు పూర్తయితే చెంబేడు కాలువ ద్వారా తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ, నెల్లూరు జిల్లాలోని పెళ్లకూరు మండలాల పరిధిలో 10,200 ఎకరాలకు అదనంగా సాగునీటిని అందించే అవకాశం కలుగుతుందన్నారు. తద్వారా రైతన్నలు ప్రజలకు ఎక్కడ నీటి కష్టం లేకుండా ప్రజలు సుభిక్షంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, గుమ్మడి బాలకృష్ణయ్య, జెడ్పిటిసి సంధ్యారాణి, వడ్ల తాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి, గోరా,శరవణ ,కంట ఉదయ్ కుమార్, కోవి చంద్రయ్య నాయుడు పాల్గొన్నారు.

ఖాట్మండు యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి - క్యాంపస్ : అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయు), ఖాట్మండు యూనివర్సిటీ నేపాల్ వారు సంయుక్తంగా నేపాల్ లోని ఖాట్మండు యూనివర్సిటీలో ఈనెల 15 నుంచి 17 వరకు జరిగిన భారత్ నేపాల్ హయ్యర్ ఎడ్యుకేషన్ సమ్మిట్ లో శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి భారతి పాల్గొని అక్కడి కాట్మండు యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా రెండు యూనివర్సిటీల మధ్య రీసెర్చ్ కొలాబరేషన్స్, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్స్, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్స్, డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్స్ వంటి అంశాల ద్వారా రెండు యూనివర్సిటీలు ఒకదానితో ఒకటి సహకరించుకుని ఎన్ఈపి ట్వంటీ ట్వంటీ ద్వారా ఉన్న ఆబ్జెక్టివ్స్‌ని ఫుల్ ఫిల్ చేసుకోగలుగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాట్మండు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బోలా తప, రిజిస్టర్ ప్రొఫెసర్ డాక్టర్ అచ్యుత్ వాంగ్లే పాల్గొన్నారు.

బృందమ్మ కాలనీలో తాగునీటికి పరిష్కారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని బృందమ్మ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యకు బొజ్జల రిషిత రెడ్డి పరిష్కారం చూపారు. ఇంటింటికి బొజ్జల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె బృందమ్మ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తాగునీటి సమస్యను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆమె టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి తో మాట్లాడి వెంటనే కాలనీలో బోరు ఏర్పాటు చేయించారు.

వలస 'బతుకు'లు

రాజస్థాన్ నుంచి ఓజిలికి..



ప్రజాశక్తి - ఓజిలి: 'కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం, జాలరి పగ్గం, సాలెల మగ్గం, శరీర కష్టం స్ఫూరింపచేసే.. గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి సహస్ర వత్తుల సమస్త చిహ్నాలు' అని శ్రీశ్రీ దేశంలో చేతివృత్తులను కీర్తిస్తూ రాసిన కవిత్వం ఇక్కడ గుర్తు రాకమానదు. భాష, ప్రాంతం వేరైనా. జీవన పోరాటం ముందు అన్నీ బలాదూర్. ఆధునిక యుగంలో మరయంత్రాలతో పోటీపడి ఎండకు, చలికి తట్టుకొని కమ్మరి పని చేస్తూ జీవన పోరాటం సాగిస్తున్నారు. రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన కుటుంబాలు పిల్లాజెల్లలతో ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి జిల్లా ఓజిలి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ప్రతి ఏటా వలస వస్తుంటారు. రోడ్డు పైనే వంటా వార్పు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఆడ, మగ, పిల్లలు, ముసలి అన్న తేడా లేకుండా అందరూ కష్టపడతారు. ఇనుమును కొలిమిలో కాల్చి రకరకాల పనిముట్లు తయారు చేస్తున్నారు. కఠినమైన ఇనుమును కరిగించి కావలసిన రీతిలో మలచి పనిముట్లు తయారు చేసే వీరికి తమ జీవితాలు ఎలా మలుచు కోవాలో తెలియదు. సంచార జాతి వలె చలికి, ఎండకు తట్టుకొని బతుకు బండి లాగుతున్నారు. పండు ముసలి మొదలు పాలుతాగే పిల్లలు వరకు ఇదే పనిలో ఉంటున్నారు. లారీ కమాన్ ముక్కలు కేజీ రూ.30 చొప్పున కొనుగోలు చేస్తారు. కొలిమి కాల్చడానికి బొగ్గును కొంటారు. వీటి ద్వారా కొలిమి కాల్చి వివిధ రకాల ఇనుము పనిముట్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. రోజుకు సుమారుగా రూ. 4 వేలు నుండి రూ. 5 వేలు వరకు అమ్మకాలు ఉంటాయని మహేందర్ సింగ్ తెలిపారు. పెట్టుబడి పోను మిగిలింది వీరి కష్టానికి ప్రతిఫలం. కుటుంబమంతా ఒళ్లొంచి పనిచేస్తే గాని వీరి నోట్లోకి ముద్ద పోదు. వీరి పిల్లలకు బడులుండవు. వీరితో పాటే వారూ సంచార జీవనం గడపాల్సిందే.

శ్రీ కృష్ణదేవరాయుని జీవితం ఆదర్శనీయం : టిటిడి చైర్మన్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ చక్రవర్తి శ్రీ కష్ణదేవరాయల వారి జీవితం అందరికి ఆదర్శనీయమని తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకమండలి చైర్మన్, తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. తిరుపతి లీలామహల్ సర్కిల్లో శుక్రవారం శ్రీ కష్ణదేవరాయల విగ్రహ పున: ప్రతిష్ట ఆవిష్కరణ కార్యక్రమంలో భూమన కరుణాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయం ముద్రనారాయణ పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ శ్రీ కష్ణదేవరాయులు ప్రజా పరిపాలన అద్భుతంగా సాగించారని, ఓవైపు ప్రజల క్షేమం, మరోవైపు కళలు, సంస్కృతి, ఆచారాలు, భక్తి వీటిన్నింటిని మేళవించుకొని పరిపాలన చేసిన గొప్ప చక్రవర్తి అని కొని యాడారు. తన ఇరవై సంవత్సరాల పాలనలో తిరుమల వేంకటేశ్వర స్వామి వారిని ఏడు సార్లు దర్శించుకొని, వేల కోట్ల విలువ గల్గిన అభరణాలు స్వామికి సమర్పిం చి, స్వామి కీర్తిని ప్రపంచానికి చాటిన గొప్ప చక్రవర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అనీష్ రాయల్, వరికుంట్ల నారాయణ పాల్గొన్నారు.

నైపుణ్య చోదక విద్యా విధానంతో మరో ముందడుగు

ఎస్‌వియు విసి ఆచార్య శ్రీకాంత్ రెడ్డి



ఆన్‌లైను కార్యక్రమాన్ని తిలకిస్తున్న ఎస్‌వియు విసి శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమరావతి నుండి ఆన్‌లైనులో శుక్రవారం ప్రారంభించిన ఎడెక్స్ విద్యా విధానంపై యస్వీయూ ఉపకులపతి ఆచార్య శ్రీకాంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ నైపుణ్య చోదక విద్యా విధానంతో ఏపీలో మరో ముందడుగు పడి నట్లు యిందని విసి అన్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన విశ్వ విద్యా లయాలైన హార్వర్డ్, ఆక్స్ఫర్డ్, క్వీన్స్ ల్యాండ్ వంటి ఉన్నత సంస్థల విద్యా విధానాన్ని ఆంధ్రదేశంలో అనుసరించాలనే ఉద్దేశంతో స్కిల్ ఓరియెంటెడ్ కోర్సులను ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాలయాల్లో ప్రవేశపెట్టడానికి ముఖ్యమంత్రి చొరవ చూపించడం హర్షణీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు ప్రపంచ స్థాయిలో తమ ప్రతిభను చాటుకునేందుకు ఇది చక్కని అవకాశమని, విదేశీ విశ్వవిద్యాలయాల్లోని విద్యలో ఉన్న స్కిల్ ఓరియెంటెడ్ విధానం నేడు వివిధ విశ్వ విద్యాలయాలు, కళాశాలలు ఎంపిక చేసుకు నేందుకు అవకాశం కల్పించడం వారి ముందు చూపుకు నిదర్శనమన్నారు. దీని వల్ల అనేక మంది విద్యార్థులు భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు పొందే అవకాశం వుందన్నారు. ముఖ్యమంత్రి ఎడెక్స్ కోర్సులపై ప్రారంభించిన ఆన్లైన్ కార్యక్రమంలో తిరుపతి కలెక్టర్ కార్యాలయం నుంచి యస్వీయూ, శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం, స్విమ్స్ , వెటర్నరీ, అగ్రికల్చర్ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొనగా, యస్వీయూ విసి విద్యార్థులను పరిచయం చేశారు. ఇప్పటికే యస్వీయూ నుండి 28 వేల మంది విద్యార్థులు ఈ కోర్సులో చేరడానికి ఆన్‌లైనులో దరఖాస్తు చేసుకున్నారని , ఇంకా ఎన్ని వేలమంది నూతన సబ్జెక్టు ఎంపిక చేసుకుంటారో త్వరలో తెలుస్తుందన్నారు. ఈ విద్యాసంవత్సరం నుండే విద్యార్థులు ఎంపిక చేసుకున్న ఎడెక్స్ సబ్జెక్టులపై 2,4,6 సెమిస్టర్లలో విషయ బోధన జరుగుతుందని, విద్యార్థులకు వీటిని అదనపు క్రెడిట్స్‌గా పరిగణిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ , విద్యార్థులు పాల్గొన్నారు.

యువత 'మత్తు' వీడాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: యువత మత్తు వ్యసనాల నుంచి బయటపడి ఉత్తమ సమాజ నిర్మాణం కోసం బాటలు వేయాలని జమఅతే ఇస్లామీ హింద్ తిరుపతి నగర అధ్యక్షుడు అమీర్ బాషా పిలుపు నిచ్చారు. స్థానిక బహదూర్ పేట మస్జిద్ మహమ్మదీయలో జమ అతే ఇస్లామీ హింద్ సంస్థ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నిర్మూలనపై కరపత్రాలు, గోడ పత్రికలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమీర్ బాషా మాట్లాడుతూ నేటితరం యువత మత్తు పదార్థాల బారినపడి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. వాటి నుంచి బయటపడితేనే యువతకు, సమాజానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పిలుపు నిచ్చారు. జమ అతే ఇస్లామీ హింద్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ మహమ్మద్, దావూద్, ముజమ్మల్, గౌస్ మోదీన్, ఇంతియాజ్, అక్బర్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం బేరివాని కండ్రిగ గ్రామానికి చెందిన మునస్వామికి నగరిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు అయిన నాల్గు లక్షల రూపాయల చెక్కును రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల, క్రీడ శాఖ మంత్రి ఆర్ కె రోజా శుక్రవారం పంపిణీ చేశారు. బేరివాని కండ్రిక కి చెందిన మునస్వామి భార్య మంజుల డెంగీతో ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతూ మృతి చెందారు. ఆరోగ్యశ్రీలో సంబంధిత సేవలు లేకపోవడంతో ఇందు నిమిత్తం అయిన ఖర్చును వివరాలతోసహా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మృతురాలు మంజుల వైద్యానికి అయిన ఖర్చులను 4లక్షల రూపాయలను భర్త మునుస్వామికి శుక్రవారం చెక్కు రూపంలో అందించారు. చెక్కు అందించినందుకు బాధితుడు కృతజ్ఞతలు తెలుపు కున్నాడు.



సీఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న మంత్రి రోజా

లార్వా నిర్మూలనతో అన్ని జ్వరాల కట్టడి

ప్రజాశక్తి -దొరవారిసత్రం : పలు రకాల దోమ కాటు ద్వారా సంభవించే జ్వరాలను లార్వాలను నిర్మూలిస్తే పూర్తిగా అరికట్టవచ్చని ఉప మలేరియా అధికారి రమేష్ బాబు అన్నారు. ఆయన దొరవారి సత్రం పిహెచ్‌సి పరిధిలోని నేలపట్టులో జ్వరాల పరిస్థితిని పరిశీలించారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందితో ప్రతి ఇంటిని సర్వే చేసి ఇంటి ఆవరణలో నీటి పాంత్రల్లో లార్వాలను పరిశీలించారు. పలు గృహాల్లో లార్వాను గుర్తించి వారికి వీటి ద్వారా సంభవించే పలు రకాల జ్వరాల గురించి తెలిపారు. గ్రామ సర్పంచ్ రామయ్య పర్యవేక్షణలో ప్రతి ఇంటిలో దోమల నిర్మూలనకు సైఫరేత్రమ్ ద్రావణాన్ని డీజిల్ మిశ్రమం చేసి ప్రతి గృహంలో స్ప్రే చేయించారు. జ్వరం సోకిన గృహాలను సందర్శించి వారి వ్యాధి తీవ్రతను, లక్షణాలను అడిగి తెలుసుకున్నారు. గత కొన్ని రోజులుగా ఆ గ్రామంలో రోగుల వైద్య సేవలు నిమిత్తం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి వారికి వైద్యం అంది స్తున్నారు. ఆ గ్రామంలో జ్వర పీడితుల సంఖ్య తగ్గు ముఖం పట్టినట్లు వైద్య ఆరోగ్య సేవ సర్వేలో నిర్ధారిస్తున్నారు. కాచి చల్లార్చిన నీళ్ళ, మంచి పోషక విలువలు కలిగిన ఆహారం, తీసు కోవా లని వైద్యం అందించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపరువైజర్ స్టాఫ్ పద్మావతి, మైథిలి, గోపి కిరణ్, ఎం ఎల్ హెచ్ పి తస్లీమ్, ఏఎన్ఎంలు రమణమ్మ, వెంకమ్మ, ఆరోగ్య కార్యకర్తలు విజయ్ కుమార్, వెంకటయ్య, సుధాకర్, రత్నయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



లార్వా నిర్మూలన మందు చల్లుతున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

పరిశోధనలలో సాంఖ్యిక శాస్త్ర డేటా సైన్స్ ఎంతో ఉపయోగకరం

ఎస్వీయూ అంతర్జాతీయ సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూ స్టాటిస్టిక్స్ విభాగంలో 'మోడ్రన్ స్టాటిస్టిక్స్ ఫర్ రీసెంట్ డెవలప్‌మెంట్స్ ఇన్ డేటా సైన్స్ టెక్నిక్స్' అనే అంశంపై రెండురోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ప్రస్తుతం ఎంతో ప్రాధాన్యత కల్గిన కోర్సు డేటా సైన్స్ అని, అన్ని సంస్థల్లో అందు బాటులో ఉంటూ విస్తృత ఉద్యోగ అవకాశాలు ఇస్తున్న కోర్సు అని వక్తలు పేర్కొన్నారు. ప్రారంభ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథి వర్సిటీ పరిశోధన డీన్ ఆచార్య ఎస్ విజయభాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డేటా సైన్స్ అవశ్యకత, అవకాశాలు, బిగ్ డేటా విశ్లేషణ, ఈ కోర్సుల్లో వస్తున్న మార్పులు వివరించారు. సదస్సు కార్యనిర్వాహక డైరెక్టర్ డాబి సరోజమ్మ మాట్లాడుతూ ఈ సదస్సుకు వివిధ ప్రాంతాలకు చెందిన అధ్యాపకులు, పరిశోధకులు తమ పరిశోధన పత్రాలు పంపారన్నారు. రెండు రోజుల పాటు డేటా సైన్స్ టెక్నిక్స్ అనే అంశంపై ఫలవంతమైన చర్చ కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సాంఖ్యక శాస్త్ర పితామహుడు ప్రొఫెసర్ ఆర్ఏ ఫిషర్ 134వ జయంతి సందర్భంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ దత్తాత్రేయరావు, ఎస్వీయూ విశ్రాంత ప్రొఫెసర్ పి బాలసిద్ధముని, పాండిచ్చేరి యూనివర్సిటీ మ్యాథమేటికల్ సైన్స్ డీన్ పి తిరుపతిరావు, అధ్యాపకులు ప్రొఫెసర్ ఎస్ వెంకట్రమణారెడ్డి, డాక్టర్ కె మురళీ, డాక్టర్ పి రామకృష్ణారెడ్డి, డాక్టర్ ఎం నరేష్, డాక్టర్ నాగ విహారి పాల్గొన్నారు.

'జనాభా ప్రాతిపదికన బిసిలకు సీట్లు కేటాయించాలి'

ప్రజాశక్తి -వెంకటగిరి : 'ఓట్లు మావి సీట్లు మీవా... ?' అంటూ జనాభా ప్రాతిపదికన అసెంబ్లీ స్థానాలను బీసీలకు కేటాయించాలంటూ ఏవిఆర్ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం నిర్వహించిన బీసీల రాష్ట్ర నాయకులు ఒట్టూరు సంపత్ రాజు హెచ్చరించారు. ఒక పార్టీ బీసీల పార్టీ అంటూ, మరొక పార్టీ ఎస్సీ, ఎస్టి, మైనారిటీ, బిసి అంటూ మోసపూరితమైన మాటలు చెబుతున్నారన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రధాన పార్టీలపై తక్కువ శాతం జనాభా కలిగిన అగ్ర వర్ణాల నాయకులు తమ ఓట్లతో రాజ్యాధికారాన్ని చేజిక్కించుకుంటుంటే దశాబ్దాలుగా తాము వారి పల్లకి మోస్తూనే ఉండాలని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు అధిక జనాభా కలిగిన నియోజకవర్గంలో సీట్లు కేటాయించాలన్నారు. ఎన్‌టి రామారావు టిడిపిని స్థాపించి బీసీలకు ఆనాడు 23 శాతం చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించారన్నారు. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఇంకా బీసీలకు స్థానాలను రిజర్వేషన్ చేయాలని తద్వారా ఎనుకబడిన కులాల వారు రాజ్యాధికార దిశగా అభివృద్ధి చెందుతారన్నారు. తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుంటే ఎన్నికల్లో తమ ప్రతాపం చూపుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ రామచంద్రయ్య, సి నాగేంద్ర, పృథ్వి, చిల్లకుల జనార్ధన్, బీసీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ వెల్నెస్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు రూరల్ మండల పరిధిలోని గోపాల కృష్ణాపురంలో 40 లక్షల రూపాయలలో నిర్మించిన సచివాలయం ప్రారంభించిన ప్రదేశంలోనే 23.94 లక్షల రూపాయలతో నిర్మించిన రైతు భరోసా, కేంద్ర, 20.30 లక్షల రూపాయలతో నిర్మించిన వైఎస్సార్ వెల్నెస్ సెంటర్‌ల నూతన భవనాలను మంత్రి ఆర్‌కె రోజా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరగకుండా నేరుగా వాలంటీరు వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటికే పథకాలు అందుతున్నాయన్నారు. సచివాలయం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారం అవుతున్నాయని రైతుల సంక్షేమం కోసం అన్ని అందుబాటులో తేవడానికి రైతు భరోసా కేంద్రం, ప్రజలకు సరైన వైద్య ఆరోగ్యం కోసం వెల్నెస్ సెంటర్ లను మంజూరు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో మళ్ళీ జగనన్నను గెలిపించుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలు తెస్తారని స్పష్టంచేశారు. నగరి నియోజకవర్గంలో తనను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. అనంతరం రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మండల వైసిపి అధ్యక్షురాలు మునివేలమ్మ, వైస్ ఎంపీపీ మునుస్వామి రెడ్డి, పుత్తూరు మున్సిపల్ వైస్ చైర్మన్ డి జయ ప్రకాష్, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, సర్పంచ్ గోవి స్వామి రెడ్డి, మురళీమోహన్ పాల్గొన్నారు.

వైసీపీ నుండి టీడీపీలో చేరికలు

ప్రజాశక్తి -కోట : కోట మండలం తిమ్మనాయుడు పాలెం పంచాయతీ నుండి వైసీపీకి చెందిన 50 కుటుంబాల వారిని, టిడిపి మండల అధ్యక్షులు మద్దాలి సర్వోత్తమ రెడ్డి అధ్యక్షతన నాయకులు మారంరెడ్డి, శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మర్రి నాగభూషణం అధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే, గూడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పాశం సునీల్ కుమార్ టిడిపిలోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామం నుండి వార్డు మెంబర్ నాగేల్ల గురునాథం, నాగేల్ల కోటేశ్వరరావు, తిరుమూరు ప్రతాప్, తిరుమూరు చంద్రయ్య, కంచి చెంచయ్య, మర్రి శ్రీనివాసులు, వాదానాల శ్రీనివాసులు, ఎర్రమతి నాగేశ్వరరావు, నెల్లిపూడి బాలసుబ్రహ్మణ్యం, తిరుమలశెట్టి. రమణయ్య, తదితరులకు కండువా కప్పి ఆ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మారంరెడ్డి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్, పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచు రామయ్య, కోట మండల నాయకులు పాదర్తి కోటేశ్వర రెడ్డి, టీడీపీ తిరుపతి పార్లమెంట్ ముస్లిం మైనారిటీ నాయకులు షేక్.జలీల్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చిల్లకూరు మండల పరిధిలోని బుదనం టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీల్లో భాగంగా గంజాయి కలిగి ఉన్న ఇద్దరి వ్యక్తులను అరెస్ట్ చేశామని గూడూరు సెబ్ సిఐ రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని సెబ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధనం ప్రాంతాల్లో సెబ్ అధికారులు వాహన తనిఖీల్లో భాగంగా వారివద్ద గంజాయిని గుర్తించి అరెస్ట్ చేశారన్నారు. వారి నుండి సుమారు 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకు న్నామన్నారు. ఎవరైనా గంజాయిని తరలిస్తే చట్ట పరమైన చర్యలు చేపడతామన్నారు. అనంతరం సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సెబ్ సిఐ రమేష్ , ఎస్ఐ మోసెస్ , సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశనగ నూర్పిడి యంత్రం పంపిణీ



వేరుశనగ నూర్పిడి యంత్రాన్ని అందిస్తున్న మండల వ్యవసాయాధికారి భారతి

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో వ్యవసాయ అధికారి భారతి ఆధ్వర్యంలో సబ్సిడీ ద్వారా ప్రభుత్వం అందించే వేరుశనగ నూర్పిడి యంత్రాన్ని శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డు తూ రైతులకు సులభ యాంత్రీకరణ వ్యవసాయంలో భాగంగా వేరుశనగ నూర్పిడి యంత్రాలతో వేరుశనగ రైతులకు శ్రమ, ఖర్చు తగ్గించేందుకు ఉపయోగకరంగా వుండేందుకు బుచ్చినాయుడు కండ్రిగ మండల కేంద్రంలోని పద్మావతి ఫార్మర్ ప్రొడ్యూసర్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ద్వారా రైతుకు సుమారు నాలుగు లక్షల రూపాయలు వ్యయం చేసే వేరుశనగ నూర్పిడి యంత్రాన్ని సబ్సిడీపై వ్యవసాయ అధికారి భారతి చేతుల మీదుగా అందించారు. పద్మావతి ఫార్మాట్ ప్రొడ్యూసర్ చీఫ్ ప్రమోటర్, సురుటు పల్లి దేవస్థానం బోర్డు నెంబర్, అజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రెండు లక్ష రూపాయలు సబ్సిడీ అందించారు. కనమనంబేడు యువ రైతు కే షణ్ముగంకు యంత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది, రేవతి గ్రామస్తులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు ఉత్తమ సేవ పురస్కారాలు

ప్రజాశక్తి - ఓజిలి :ఉత్తమ సేవలందించిన వాలంటీర్లకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య దుశ్శాలువా కప్పి జ్ఞాపికలతో సత్కరించి బహుమతులు ప్రదానం చేశారు. మండల ఎంపిడివో కార్యాలయంలో నిర్వహించిన వాలంటీర్ల అభినందన సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి కుల, మత, వర్గ భేదాలు లేకుండా లబ్ధిదారులందరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గడ్డం అరుణా రెడ్డి, జెడ్‌పిటిసి గుంటమడుగు రవీంద్ర రాజు , వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు , సర్పంచులు, ఎంపిడివో శ్రీనివాసులు, సిఐ జగన్మోహన్ రావు , ఎస్ఐ పి రవిబాబు, కో ఆప్షన్ నెంబర్ ఖాదర్ బాషా, పిఎసిఎస్ అధ్యక్షులు ఎద్దల రాజరామిరెడ్డి, మండల కన్వీనర్ పాదర్తి హరినాథ్ రెడ్డి, నాయకులు దేశిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ముమ్మడి సుబ్బారావు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి: సీఐ



క్రీడలను ప్రారంభిస్తున్న సిఐ వేణుగోపాల్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పిల్లలకు విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని శారీరక, మానసిక ఉల్లాసం పెంపొందిం చుకో వచ్చని గూడూరు రూరల్ సీఐ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గూడూరు పట్టణ సమీపంలోని గోగినేని పురంలోని ఆదిశంకర పాఠశాలలో వార్షిక క్రీడా పోటీలు శుక్రవారం నిర్వహించారు. రూరల్ సిఐ వేణుగోపాల్ రెడ్డి పాల్గొని క్రీడలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ క్రీడలు ఆడడం వల్ల మానసిక, శారీరక ఉల్లాసం పెరుగుతుందని నేటి పరిస్థితుల్లో పిల్లలు ఎక్కువగా టీవీలు, సెల్ ఫోన్లకు టైం కేటాయిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలని క్రీడలలో గెలుపు ఓటములు అర్థం చేసుకుంటారని అవి జీవితంలో ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ రూపవతి, మల్లికార్జున్, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడితే అక్రమ కేసులా?: టిడిపి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గంలో కొంత మంది అధికారులు వైసిపి కార్యకర్తలు లాగా పనిచేస్తున్నారని టిడిపి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం కావాలని పోరాడితే తమ పార్టీ నాయకుల, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వారిని న్యాయస్థానాలు చుట్టూ తిప్పుతూ అధికారులుపైశాచిక ఆనందం పొందుతున్నారని వారు దుయ్యబట్టారు. అక్రమ కేసు బనాయించడంతో పుత్తూరు సీనియర్ సెషన్స్ సివిల్ జడ్జి ముందు టిడిపి నాయకులు, చిత్తూరు పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షులు సి షణ్ముగం రెడ్డి, పుత్తూరు పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, టిడిపి అధ్యక్షులు, మాజీ వైస్ ఛైర్మన్ ఎ ఆనంద్, పుత్తూరు మున్సిపాలిటీ, ఏలుమలై రెడ్డి, పుత్తూరు పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు, పదో వార్డు ఇన్‌ఛార్జి రాష్ట్ర తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్ డి జి ధనపాల్ పాల్గొన్నారు.

అమ్మానాన్నలా సేవ చేస్తా: నేదురుమల్లి

ప్రజాశక్తి - బాలాయపల్లి : వెంకటగిరి నియోజకవర్గంలో బాలాయపల్లి మండలానికి అమ్మ నాన్న ఏ గుర్తింపు ఇచ్చారో ఆ గుర్తింపు ఇచ్చి సేవ చేసేందుకు తాను సిద్ధంగా వున్నానని తిరుపతి జిల్లా వైసిపి అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పేర్కొన్నా రు. మండలంలోని జయంపు గ్రామంలో ని మాజీ ఎంపీపీ, వెంకటగిరి మార్కెట్ కమిటీ ఛైర్మన్ సింగంశెట్టి భాస్కర్ రావు, ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి సతీమణిని ఆయన పరామర్శించారు. పనిచేసేవారికి గుర్తింపు ఉంటుందని, బాలాయపల్లి మండలం అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా పని చేసేందుకు సిద్ధంగా వున్నానన్నారు. పనిచేస్తున్న వారికి మంచి స్థానం కల్పిస్తా మన్నారు. ఏ గ్రామంలోనైనా సమస్య ఉంటే నాయకులతో కలిసి పని చేస్తే రేపు వారితో పోరాడి ఓట్లు వేయించుకోవచ్చునని ఆయన తెలిపారు. ఆయన వెంట మండల వైసిపి కన్వీనర్ వెందోటి కార్తీక్ రెడ్డి, వైసిపి నాయకులు, బాలాయపల్లి సహకార సంఘం అధ్యక్షుడు పల్లంటి రాంబాబు నాయుడు, గుర్రం రామ్మూర్తి యాదవ్,గోపాల్ యాదవ్, మండలంలోని నిడిగల్లు ,పిగిలాం, తదితర గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'వాలంటీరు సేవా తత్వం అలవర్చుకోవాలి'

ప్రజాశక్తి - క్యాంపస్ : నూతన వాలంటీర్లు సామాజిక సమాజ సేవా కార్యక్రమ తత్వాన్ని పెంపొందించుకోవాలని ప్రొఫెసర్ విద్యావతి పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ బ్యూరో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ 9, 18, 20, 21 సంయుక్తంగా ఎన్ఎస్ఎస్ ఓరియంటేషన్ ప్రోగ్రాంని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ విద్యావతి , ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ కొత్తగా చేరిన వాలంటీర్లు సామాజిక సమాజ సేవా కార్యక్రమ తత్వాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ, సెట్విన్ డిఎస్ఏ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని 'మాతృభాష పరిరక్షణలో యువత పాత్ర' అంశంపై వ్యాసరచన పోటీని, "తెలుగు భాష– సంస్కృతి" అనే అంశం పై కవిత్వ పోటీలను నిర్వహించారు. ఇన్ ఛార్జ్ తెలుగు శాఖాధ్యక్షులు డా.వై.సుభాషిణి మాట్లాడుతూ మాతృభాషలో జ్ఞానాన్ని సంపాదించిన వ్యక్తి ఎందులోనైనా అభివృద్ధిని సాధి స్తాడని, యువత ప్రతి ఒక్కరూ మాతృభాష పరిరక్షణకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డా.యువశ్రీ, డా. మాధవి, డా. అనురాధ వ్యవహరించారు. ఈ పోటీలల్లో విశ్వవిద్యాలయంలోని విద్యార్థినులు పాల్గొన్నారు.

Before The I Addl. Motor Accidents Claims Tribunal : Nellore

M.V.O.P.No. 461 / 2023

1. Sannareddy Padmavathamma and 3 others - Claimants

Vs

1. Gnanam Polaiah and 2 others - Respondents

Notice to 2nd Respondent

GCKR Enterprises, Rep.by its Proprietor. **Appadi Sampurnamma,** Owner of the OMINI Bus bearing Registration No.AP.39.UM.4030 and Residing at 211, SBI Street, Menakur, Naidupet, Sri Balaji, Andhra Pradesh-524128.

పై నెంబరున క్లయిమెంట్స్ మీపై యాక్సిడెంట్ నష్టపరిహారము కోరుతూ పైన తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే07-03-2024** దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవల సినది లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

టి.వి.కళ్యాణ్ కుమార్, బి.కాం., బి.ఎల్., క్లయిమెంట్స్ తరపు అడ్వకేట్, నెల్లూరు.